

## డ్వాక్రా సంఘాలకు నిధులు మంజూరు

పాచిపెంట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డ్వాక్రా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద ప్రభుత్వం రూ.800 కోట్లు మంజూరు చేసిందని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్, వెలుగు కార్యాలయాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడుతూ.. హక్కు పత్రాలతో భూసమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో కూడా పూర్తిస్థాయిలో రికార్డులు లేకపోవడం వల్ల ఈ ప్రక్రియ జాప్యమవుతుందన్నారు. ధాన్యంతో పాటు పత్తి కొనుగోలు యోచనలో ప్రభుత్వం ఉందన్నారు.

## నేడు నాగులచవితి


పార్వతీపురం/సాలూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయంలో నాగులచవితికి ఎంతో ప్రాధాన్యం ఉంది. దీపావళి అమావాస్య ముగిసిన ఐదో రోజున కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడం పూర్వకాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితిని నిర్వహించేందుకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. శనివారం పుట్టల వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లి పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పుట్టల్లో శనివారం పాలుపోసి నాగరాజుకు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందుకు అవసరమైన పూజా సామగ్రిని శుక్రవారం కొనుగోలు చేశారు. అయితే నాటు కోడి గుడ్లుతో పండ్లు, పూలు, ఇతర వస్తువుల ధరలు కొండెక్కడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. కాగా శనివారం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోగా పుట్టలో పాలు, నూలు చిమ్మి, గుడ్లు వేసి పూజించొచ్చని రుత్వికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సాలూరు మండలం శివరాంపురంలో నాగదేవత గుడి పూజలకు సిద్ధమైంది. పాలకొండ, పార్వతీపురం, కురుపాంతో పాటు 15 మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



శివరాంపురంలో నాగదేవత ఆలయం

# ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం

- మన్యంలో 180 కేంద్రాల ఏర్పాటు
- నవంబరు 10 నుంచి ప్రక్రియ ప్రారంభం
- 27 నుంచి సిబ్బందికి శిక్షణ తరగతులు



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

పార్వతీపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమైంది. వచ్చేనెల పదో తేదీ నుంచి ప్రక్రియ చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమ వుతుంది. ఈ మేరకు 281 ఆర్ఎస్‌కేల(రైతు సేవా కేంద్రాలు) పరిధిలో మొత్తంగా 180 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా రైతులు ముందస్తుగా ధాన్యం విక్రయించినా కొనుగోలు చేయనున్నారు. అయితే అధికారికంగా నవంబరు 10 నుంచి కేంద్రాలను ప్రారంభించనున్నారు.

### ఇదీ పరిస్థితి..

- ఈ ఏడాది జిల్లాలో 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది 2.24 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి.. గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలతో అన్నదాతలు ఎంతో సంబరపడ్డారు. వాస్తవంగా వారు గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ధాన్యం కొనుగోలుకు అష్టకష్టాలు పడేవారు. సకాలంలో నగదు జమ అయ్యేది కాదు. దీంతో అత్యధిక రైతులు ఇతర జిల్లాల మిల్లర్లకు ధాన్యం విక్రయించుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఇక్కట్లు తొలగిపోయాయి. సర్కారు ఆదేశాలతో గత ఏడాది జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించగా.. ఈ సంవత్సరం 2.57 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అదేవిధంగా ధాన్యం విక్రయించే రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



- జిల్లాలో 100 కిలోల ఏ-గ్రేడ్ రకం ధాన్యం మద్దతు ధర రూ.2,381, సాధారణ రకం రూ. 2,369గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 27 నుంచి దీనిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. జిల్లాలోని 281 రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.
- ఈ నెల 27 నుంచి ధ్యాన్యం కొనుగోలుపై సంబంధిత సిబ్బందికి శిక్షణతరగతులు నిర్వహించనున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉండే టెక్నికల్ అసిస్టెంట్స్, సహాయకులు, ఇతర సిబ్బంది, సచివాలయ అగ్రికల్చర్ ఉద్యోగులు హాజరవ్వాల్సి ఉంది.
- ధాన్యం కొనుగోలుకు సంబంధించి 33 శాతం గోనె సంచులు మిల్లర్ల ద్వారా సరఫరా చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైతులు గోనె సంచులను స్వయంగా ఏర్పాటు చేసుకుంటే దానికి సంబంధించి సొమ్మును వారి ఖాతాల్లోకి జమ చేయనున్నారు. అదే విధంగా (మిగతా 8వ పేజీలో..)

# గిరిజన విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

- మంత్రి సంధ్యారాణి
- ఆశ్రమ పాఠశాలలో అదనపు భవన నిర్మాణాలకు శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు

సాలూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. కొత్తవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ..5.72 కోట్లతో చేపట్టనున్న అదనపు భవన నిర్మాణాలకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'స్వచ్ఛభారత్‌లో భాగంగా రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన వసతి గృహాల్లో 2,030 మరుగుదొడ్లను నిర్మిస్తున్నాం. రూ.185 కోట్లతో రాష్ట్రంలో 45 ఆశ్రమ పాఠశాలల్లో , జిల్లాలో ఆరు చోట్ల రూ.20 కోట్లతో అదనపు భవన నిర్మాణాలు చేపడతాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశాం. అనారోగ్యంతో బాధపడుతున్న 65 మంది విద్యార్థులను విశాఖ కేజీహెచ్‌లో చేర్పించగా 64 మంది డిశ్చార్జి అయ్యారు. మిగిలిన ఒక్కరు సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతుంటే ఆసుపత్రిలో ఉంచాం. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై శ్రద్ధ చూపిస్తున్నారు. త్వరలోనే దండిగాం రోడ్డు నుంచి కొత్తవలస గ్రామానికి రహదారి నిర్మాణం జరుగుతుంది.' అని తెలిపారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలలో 'ముస్తాబు' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు రోజూ చేతులు కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు అనారోగ్యం బారినపడితే ఆకుపసర, నాటు వైద్యం జోలికి పోవద్దని సూచించారు. సమీప ఆసుపత్రులకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో కనకదుర్గ, డీడీ విజయశాంతి, ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి, సర్పంచ్ దర్మవతి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం.. ఆరోగ్య సూత్రం

- అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత
- శారీరక సమస్యలు దూరం

6లో




## పారాది కాజ్‌వేపై వరదనీరు

- నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

6లో

# టెట్ నోటిఫికేషన్ జారీ

- టీచర్లతో పాటు నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు డిసెంబరు 10న పరీక్ష
- వచ్చే ఏడాది జనవరి 19న ఫలితాలు



సాలూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీచర్లతో పాటు నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు టెట్ రాయడానికి వీలుగా కన్వీనర్ కృష్ణారెడ్డి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు డిసెంబరు 10న కంప్యూటర్ బేస్డ్‌గా పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో 2011కి ముందు నియమితులై ఉద్యోగాలు చేస్తున్నవారు తప్పనిసరిగా టెట్ పరీక్ష రాయాల్సి ఉంది. ఇందు కోసం వచ్చే నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 25న ఆన్‌లైన్‌లో మాక్ టెస్ట్ నిర్వహించనున్నారు. డిసెంబర్ మూడు నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 150 మార్కుల చొప్పున రెండు పేపర్ల (టెట్ 1ఏ, 2ఏ)ను రాయొచ్చు. కొందరు ఒకటే రాయవచ్చు. డిసెంబరు 10న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తొలి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ నిర్వహించనున్నారు. ఏడాది జనవరి 2న టెట్ కీ విడుదల చేస్తారు. దానిపై అభ్యంతరాలను 9 వరకు స్వీకరించనున్నారు. తుది కీ వచ్చే 13న ప్రకటించనున్నారు. టెట్ ఫలితాలను 19న ప్రకటించనున్నారు. కాగా వచ్చే ఏడాది జనవరిలో మరో డీఎస్సీని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో టెట్ అర్హత లేని నిరుద్యోగులు, సుప్రీం తీర్పు ప్రకారం ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు కలిపి టెట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు 8 వేల మంది వరకు టెట్ పరీక్షను రాయాల్సి ఉంది. ● 2009లో విద్యాహక్కు చట్టం అమలు లోకి వచ్చింది. 2014, 2018, 2025 డీఎస్సీల్లో టెట్ అర్హత సాధించిన వారే ఉపాధ్యాయు లుగా నియమితులయ్యారు. కాగా 2011 ముందు నియమితులైన వారు సైతం టెట్

(మిగతా 8వ పేజీలో...)

## పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- డీఎంహెచ్‌వో భాస్కరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పార్వతీపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రంగా ఉంటే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. విధిగా ప్రతిఒక్కరూ డ్రైడే పాటించాలని సూచించారు. శుక్రవారం నర్సిపురం గ్రామంలో పర్యటించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం స్థానికులు, విద్యార్థులకు వ్యాధులు, పరిసరాల పరిశు భ్రతపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఐరెన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలను ప్రతి వారం విద్యార్థులతో వేయించాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌బీఎస్‌కే పీవో జగన్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

## పక్కాగా భూముల రీసర్వే

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి



రీసర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

సీతానగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఇప్పలవలస గ్రామంలో చేపట్టిన రీసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే, రెవెన్యూ శాఖల అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వీలైనంతవరకు పక్కా రికార్డులతో భూయజమానుల సమక్షంలోనే ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డులు కూడా పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు.

## డిప్యూటీ సీఎం వద్దకు చేరిన పంచాయితీ

8లో

- ఈనాం భూములు ఆన్‌లైన్ కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు

## అత్యున్నత విద్యాబోధనే ప్రభుత్వ లక్ష్యం

7లో

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## జగన్ మాటలకు జనం నవ్వుకుంటున్నారు

- డీసీసీబీ చైర్మన్ నాగార్జున

7లో

## హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

## సోమినాయుడువలసలో గజరాజులు

## ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట

6లో

# గంజాయి రవాణాను అరికట్టాలి

- ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం



బత్తిలిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

గుమ్మలక్ష్మీపురం/భామిని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, సారా అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఎల్విన్‌పేట, బత్తిలిలో చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న రహదారులను కూడా పరిశీలించాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం ఎల్విన్‌పేట, బత్తిలి పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. భద్రతా ఏర్పాట్లు, స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసులపై ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఒడిశా సరిహద్దు, ఏజెన్సీ ప్రాంతం కావడం వల్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదని తెలిపారు. బాధితులకు తక్షణ న్యాయం అందించాలని సూచించారు. రహదారులపై తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ హరి, ఎస్ఐలు శివప్రసాద్, అప్పారావు తదితరులు ఉన్నారు.

# జ్వరంతో గిరిజన విద్యార్థిని మృతి

- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



కవిత(ఫైల్)

సీతంపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హడ్డుబంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న మండంగి కవిత(11) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సీతంపేట మండలం డొంబంగివలసకి చెందిన మండంగి బాలకృష్ణ, చామంతిలు పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె(కవిత) ఉన్నారు. కాగా దసరా సెలవుల తర్వాత నుంచి హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలోనే ఉన్న కవితకు బుధవారం సాయంత్రం జ్వరం వచ్చింది. దీంతో పాఠశాల సిబ్బంది బాలికను సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కవితను పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ పరిస్థితి మెరుగవకపోవడంతో గురువారం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం బాలిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఒక్కగానొక్క కుమార్తె అకాల మృతిని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. కవిత జ్ఞాపకాలను తలుచుకుని భోరున విలపిస్తున్నారు. మరోవైపు స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కవితకు మలేరియా, టైఫాయిడ్, తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గ ముఖంతో పాటు ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు టెస్టుల్లో నిర్ధారణ అయ్యిందని ఏపీ గిరిజనసంఘం అధ్యక్షులు లక్ష్మణరావు, కుటుంబసభ్యులు చెప్పారు. దీనిపై పాఠశాల హెచ్ఎం ఉమావాణిని వివరణ కోరగా.. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగానే బాలిక మృతి చెందినట్లు తెలిపారు.

# ఆధ్యాత్మికం.. ఆరోగ్య సూత్రం

- అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత
- శారీరక సమస్యలు దూరం
- జిల్లాలో లక్ష మంది వరకూ దీక్షాధారణ





పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

రాజాం పట్టణంలో ఒకేసారి 100 మంది ఇటీవల అయ్యప్ప మాలధారణ చేశారు. స్థానిక గురుస్వామి నంది సూర్యప్రకాశరావు నేతృత్వంలో మాలధారణ కార్యక్రమం కొనసాగింది. ఒక్క రాజాం పట్టణంలోనే 2000 మంది వరకూ అయ్యప్ప మాలధారణ చేస్తారని భక్తులు చెబుతున్నారు.

రాజాం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ఓం స్వామియే శరణం అయ్యప్ప' అనే మంత్రంతో ప్రతి ఒక్కరూ పరవశించిపోతారు. ఈ నామమే భవసాగారాలు దాటించే తారకమంత్రమని దీక్షాధారులు భావిస్తారు. చలిని తట్టుకుంటూ... నియమ నిబంధనలు అనుసరిస్తూ 41 రోజుల పాటు మండల దీక్షలు చేస్తారు. తమలోని దుర్గుణాలను... వ్యసనాలను విడిచిపెట్టేందుకు కొందరు మాల ధరిస్తే.. చక్కటి ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు... భక్తి భావంతో మరికొందరు దీక్ష చేపడతారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరిలో నెలల్లో అడుగడుగునా దీక్షాధారులు కనిపిస్తారు. వాడవాడలా పడిపూజలు, భజనలు, శరణుఘోషలతో భక్తి పారవశ్యంతో తరించేలా చేస్తారు. ఈ దీక్షలతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంద ని మానసిక వైద్య నిపుణులు సైతం చెబుతున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు లక్ష మంది దీక్షాధారులు ఉంటారని ఒక అంచనా. రాజాం పట్టణంలో అయ్యప్ప దేవాలయం ఉంది. ఇక్కడ ఏటా వందల సంఖ్యలో అయ్యప్ప దీక్షలు స్వీకరిస్తుంటారు. మరోవైపు దుర్గ మాల ధారణలు కూడా రాజాం పట్టణంలో అధికమే.



మాలధారణ చేయిస్తున్న గురుస్వామి

## ఎన్నో ప్రయోజనాలు..

అయ్యప్ప దీక్షలతో మానసికంగా, దృఢంగా మారుతారని భక్తుల విశ్వాసం. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఆరోగ్యకర అలవాట్లు పెరుగుతాయి. ఉదయాన్నే లేవడంతో ఆ రోజంతా మనసుకు హాయిగా ఉంటుంది. మనసు తేలికపడి ఏకాగ్రత పెరుగుతుంది. స్నేహం, ప్రేమాను రాగాలతో సమాజంలో అందరూ సమానమనే దృక్పథం వస్తుంది. ఇతర భక్తులతో ఇచ్చిపుచ్చుకునే స్వభావం పెరిగి మనసులో సేవాభావం పెరుగుతుంది. శరీరాన్ని, మనసును అదుపులో ఉంచుకొని సన్మార్గంలో నడిచేలా చేస్తుంది. సామూహికంగా కలిసి ఉండడంతో ఐక్యతాభావం పెరుగుతుంది. క్రమశిక్షణ అలవడుతుందని భక్తులు చెబుతారు.

## శారీరకంగా..

అయ్యప్ప మాల ధారణతో శారీరకంగానూ ప్రయోజనాలు అధికంగా ఉన్నాయని చెబుతారు. ప్రధానంగా ఉద్వేగం అదుపులో ఉంటుంది. హృద్రోగ సమస్యలు తగ్గుతాయి. సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానం చేయడం వల్ల నాడీ వ్యవస్థ, రక్తప్రసరణ వ్యవస్థలు మెరుగు పడతాయి. నేలమీద నిద్రతో ఫిట్‌నెస్ పెరుగుతుంది. వెన్నునొప్పుల వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. కండరాల పటిష్ఠత, రక్తప్రసరణ మెరుగవుతుంది. పొగ తాగడం, మద్యపానంలాంటి అలవాటు ఉన్న వారు వాటికి దూరంగా ఉండడంతో ఆరోగ్యం బాగుంటుంది. సాత్విక భోజనం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నల్లని దుస్తులు ధరించడంతో చలి నుంచి కాపాడుతూ శరీరాన్ని వెచ్చగా ఉంచుతాయి.

## పాదరక్షలు లేకుండా..

మాలధారణలో ఒక నియమం చెప్పులు ధరించకపోవడం. ఇది ఒక చికిత్సలాంటిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. నేలపై నడవడంతో శరీరంలోని అన్ని అవయవాలు ఉత్తేజమవుతాయి. మాల ధరించిన స్వాములు ఉత్త కాళ్లతో నడిస్తే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పాదాల్లో వేలాది నరాల చివరలు ఉంటాయి. ఇవి మెదడుకు సమాచారం అందిస్తాయి. ప్రశాంత నిద్రతో పాటు రోగనిరోధక శక్తి వృద్ధికి ఎంతగానో దోహదపడతాయి. పాదాలు, కాళ్లు, కండరాలు దృఢంగా మారుతాయి.

## ఆరోగ్యానికి మంచిది..

అయ్యప్ప మాలధారణ అనేది కేవలం ఆధ్యాత్మికంగానే కాదు. ఆరోగ్యపరంగానూ ఎంతో ఉత్తమమైనది. మంచి జీవనం అలవాటుచేసే ఒక భక్తిధామం. సాత్విక ఆహారంతో పాటు మనసు ప్రశాంతంగా ఉండడంతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుంది. మాలలో ఉండేవారి ఆహారపు అలవాట్లు మంచి నడవడిక వైపు అడుగులు వేయిస్తాయి.

-తిరుపతిరావు, వైద్య నిపుణుడు, రాజాం

## గొప్ప వరం...

స్వామియే శరణం అయ్యప్ప అనే జపమే మనసుకు హాయి గొల్పుతుంది. ఏటా వందలాది మందితో మాలధారణ చేయించే అదృష్టం దక్కడం నా పూర్వజన్మ సుకృతం. దశాబ్దాలుగా మాలధారణ చేస్తూ వస్తున్నా. ఏడాదిలో 41 రోజుల పాటు మండల దీక్ష చేయడం ప్రతి భక్తుడికి ఒక వరమే.

-నంది సూర్యప్రకాష్, గురుస్వామి, రాజాం

# అవి ఇక 'మెయిన్' కేంద్రాలు

- 201 మినీ అంగన్‌వాడీ కేంద్రాల స్థాయి పెంపు
- చురుగ్గా సన్నాహాలు



విద్యార్థులకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

భోగాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీల స్థాయి పెరుగుతోంది. జిల్లాలోని 201మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. దీనికి సంబంధించిన ధ్రువపత్రాలను అధికారులు పంపించారు. ఎన్నికల ముందు కూటమి నేతలు దఫదఫాలుగా మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అర్హత ఉన్న చోట్ల మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ కానున్నాయి. వీటిలో ఏడో తరగతి ఉత్తీర్ణులైన వారిని కార్యకర్తలుగా నియమించారు. వీరికి ప్రభుత్వం రూ.7వేలు వేతనంగా అందిస్తోంది. పదో తర గతి ఉత్తీర్ణులైన వారిని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలలో నియమించారు. వారికి రూ.11,500 వేతనం చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10వ తరగతి ఉత్తీర్ణులై... మినీ అంగన్‌వాడీలలో ఉన్న చోట మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 293 మినీవి ఉన్నాయి. వీటిలో 201 కేంద్రాలను మెయిన్‌కు అప్‌గ్రేడ్ చేస్తున్నారు. వీటిలో బోధించే 201 మందికి వేతనం నుంచి రూ. 7 వేల నుంచి రూ.11,500కు పెరగనుంది. మిగిలిన 92 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా విడతల వారీగా అప్‌గ్రేడ్ కానున్నాయి. దీనిపై ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.విమలారాణిని వివరణ కోరగా... జిల్లాల్లో 201 మినీ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ కాను న్నాయని నిర్ధారించారు. దీనికి సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించామని చెప్పారు.



రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



వరద పరిస్థితిపై వాహనదారులతో చర్చిస్తున్న ట్రాఫిక్ పోలీసు

# పారాది కాజ్‌వేపై వరదనీరు

- నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పారాది గ్రామం వద్ద వేగావతి నదిలో తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వేపై వరద నీరు ప్రవహించడంతో శుక్రవారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వేగావతి నదికి వరద నీటి స్థాయి పెరిగింది. దీంతో కాజ్‌వే పైనుంచి నీరు పారుతుండడంతో ఉదయం 6 గంటల నుంచి ట్రాఫిక్ స్తంభించింది. బస్సులు, మినీ వాహనాలు, కార్లను పాత బ్రిడ్జిపై నుంచి వెళ్లేందుకు ట్రాఫిక్ పోలీసులు అనమ తించారు. భారీ వాహనాలను రహదారిపై నిలిపివేశారు. దీంతో పారాది నుంచి రామభద్రపురం వరకు భారీగా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటు పార్వతీపురం నుంచి వచ్చే భారీ వాహనాలను బొబ్బిలి నుంచి తెర్లాం వైపు మళ్లిస్తున్నారు. రానున్న రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఇక్కడి పరిస్థితిని తెలుసుకుని ప్రయాణాలు చేయాలని ఎస్ఐ జ్ఞానప్రసాద్ సూచించారు.



పొలాల్లో ఉన్న ఏనుగుల గుంపు

# సోమినాయుడువలసలో ఏనుగులు

కొమరాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో ఏనుగులు అలజడి సృష్టిస్తున్నాయి. నిన్నటి వరకు అంకుళ్లవలస గ్రామ సమీపంలో సంచరించిన ఏనుగుల గుంపు శుక్రవారం సాయంత్రానికి సోమినాయుడువలస గ్రామ పరిధిలో ఉన్న వరి, జామ పంట పొలాలకు చేరుకున్నాయి. తక్షణమే ఏనుగులను తరలించి రైతులను ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా... ఏనుగులకు కవ్వింపు చర్యలకు పాల్పడకుండా జాగ్రత్త వహించాలని అటవీశాఖ సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు.



వైద్య శిబిరం నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ దామోదర్

# ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- పోలీసు ఉద్యోగులకు వైద్య పరీక్షలు

విజయనగరం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని... ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని ఎస్పీ ఎఆర్ దామోదర్ సూచించారు. జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న సుమారు 1193 మంది సిబ్బందికి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల నిమిత్తం రూ.8.95లక్షల చెక్కును స్కాన్ యు మేనేజ్‌మెంట్‌కు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా ఉద్యోగులు, హోంగార్డులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కొంత మంది ఉద్యోగులు వైద్య పరీక్షలు చేసుకోలేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు గుర్తించక ఉన్నట్టుండి అస్వస్థతకు గురికావడం... మృతిచెందే సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పోలీసు సిబ్బందికి షుగర్, బీపీ, కిడ్నీ, కొలెస్ట్రాల్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఏటా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# పైడిమాంబ ఆలయ విస్తరణకు భూమి పూజ

విజయనగరం కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయ విస్తరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ పనులకు సంబంధించి శుక్రవారం భూమి పూజ చేశారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష ఆధ్వర్యంలో పైడిమాంబ చదురుగుడి వద్ద బాలాలయానికి సంబంధించి విజయనగరానికి చెందిన దాతలు ఎం.మహేష్, కమల, తదితరుల సహకారంతో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఇప్పటికే శంకుస్థాపన చేసిన గోవా రాష్ట్ర గవర్నర్, అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు ఆదేశించారు. రూ.1.80కోట్లతో ఆలయ విస్తరణ పనులు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు.



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, భక్తులు

# 'ఉపాధి'లో సగటు వేతనం పెంచాలి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి



విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ వేతనదారులకు సగటు వేతనం పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ ఏడాదిలో సాధించిన ప్రగతి, 2025-26 సంవత్సరంలో చేపట్టనున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉద్యాన వనాలు పెంపొందించేందుకు నిర్దేశించిన కాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఏపీడీలు, ఎంపీడీవోలు గ్రామస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ లక్ష్య సాధనలో విజయనగరం ముందు వరుసలో ఉండాలన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ చెప్పారు. రహదారులు, పంట కాలువల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఫారం పాండ్స్ పనులు ఒక నెలలో ప్రారంభం కావాలని ఆదేశించారు. ఈకేవైసీ పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధి హామీలో లక్ష్యాలకు దిగువన ఉన్న మండలాల ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, సీపీవో బాలాజీ, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిరత సాధించాలి..

జిల్లాలో పేదరిక నిర్మూలన దిశగా డీఆర్‌డీఏ చేపడుతున్న కార్యక్రమాలు సుస్థిరత సాధించే దిశగా చూడాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు అవసరమైన శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లా సమాఖ్యల ద్వారా కూడా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. సుమారు 82 వేల బంగారు కుటుంబాలను గుర్తించినట్టు ఆయన వెల్లడించారు. సెర్ప్ కార్యకలపాలు కూడా పి-4కు అనుసంధానం చేసి మార్గదర్శులుగా చేయాలని సూచించారు. అనంతరం స్త్రీ నిధి రుణాలు నెలవారీగా చెల్లించాల్సిన వివరాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఫణి, మెప్మా పీడీ చిట్టిరాజులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రయాణికులు

విజయనగరం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ శుక్రవారం రాత్రి ప్రయాణికులతో కిటకిటలాడింది. సాయంత్రం 5 గంటల నుంచే ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ కనిపించింది. శనివారం నాగు ల చవితి, ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, వ్యాపారాలు చేసేవారు తమ ఇళ్లకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో రావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారింది. ప్రయాణికుల అవసరానికి తగ్గట్టుగా బస్సు సర్వీసులు లేకపోవడం... మరోవైపు మహిళలే అధిక సంఖ్యలో ఉండడంతో పురుషులు ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. బస్సుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకొని పండుగల సమయాల్లోనైనా సర్వీసుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సులో సీట్ల కోసం పోటీ

## పంచారామాలకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా భక్తుల కోసం పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సుదర్శన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమరావతి అమరేశ్వరుడు, భీమవరం సోమేశ్వరుడు, పాలకొల్లు క్షీరరామ లింగేశ్వరుడు, ద్రాక్షారామం భీమేశ్వరుడు, సామర్లకోట కొమరలింగేశ్వరుడు క్షేత్రాలు దర్శనం ఉంటుందని చెప్పారు. ఇతర సమాచారం కోసం 7382923679ను సంప్రదించాలన్నారు.

## పోలియో నిర్మూలనకు కృషి

రాజాం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలించేందుకు రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ ఎంతగానో కృషి చేస్తోందని రాజాం అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యుడు కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజాంలో రోటరీ క్లబ్ రాజాం టౌన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, రోటరీ క్లబ్ కార్యదర్శి సప్పటి వసంతరావు, రొటేరియన్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎస్సీ యువతకు 45 రోజుల పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి 15 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణ నుంచి బయిలుదేరిన శిక్షణా బస్సుకు జేసీ సేతు మాధవన్ జెండా ఊపి ప్రారంభించారు. వీరికి వీటీ అగ్రహారంలో గల ఆర్టీసీ శిక్షణ ఇవ్వనున్నట్టు జేసీ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## 30లోగా ఈ-పంట నమోదు పూర్తి చేయాలి

గంట్యాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదు ప్రక్రియను ఈనెల 30 తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ జేడీ భారతి అన్నారు. శుక్రవారం ఆమె గంట్యాడలో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది నిర్ణీత కాలంలో ఈ-పంట నమోదు పూర్తి చేయాలన్నారు. మండలంలోని లక్షా 54వేల కమతాలు ఉండగా.. ఇప్పటివరకూ 35వేల కమతాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ-పంట నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీఏ నాగభూషణ్, ఏవో శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

## మున్సిపల్ మాజీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

విజయనగరం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం మధ్యాహ్నం ఆయన నివాసంలో పరామర్శించారు. రామకృష్ణ కొద్ది రోజుల కిందట తన నివాసంలో ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆమె వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, నగర టీడీపీ అధ్యక్షుడు గంటా రవి, మహిళా కార్యదర్శి అనురాధ బేగం ఉన్నారు.

## టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

విజయనగరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలోని మండలం, నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజాదర్బార్‌లో వచ్చే వినతులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సంబంధిత విభాగాలకు ఈ వినతులు పంపించి ఆయా వినతుల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

## పీఆర్సీ ప్రకటించాలి

రాజాం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే 12వ పీఆర్సీ ప్రకటించాలని ఆ ఎంప్లాయీస్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా పీఆర్సీ ప్రకటించలేదని, పర్మినెంట్ చేయడం ద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించలేదని ఆయన ఆరోపించారు. యూనియన్ నాయకులు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ డబ్బులు తిరిగి ఇచ్చేశాం

గజపతినగరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలోగల ఖాళీ స్థలంలో మౌలిక వసతుల కల్పనకు అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మతి మేరకు నగదు వసూలు చేసినప్పటికీ కొంత మంది తిరస్కరించడంతో ఆ డబ్బును తిరిగి ఇచ్చివేశామని ప్రాజెక్టు లీడర్లు జ్యోతి, సుభాషిణిలతో పాటు సెక్టార్ లీడర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయం ఎదుట షెడ్‌తో పాటు సమావేశాలకు కుర్చీలు కొనుగోలు చేయాలని నిర్ణయించుకుని ప్రాజెక్టు పరిధిలో 213 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి రూ.500 చొప్పున వసూలు చేశామన్నారు. అందులో భాగంగా పోషణ మహా కార్యక్రమం చేపట్టామని, ఇందుకు అయ్యే ఖర్చు మినహాయించి, మిగిలిన డబ్బులను కార్యకర్తలకు అందజేశామని చెప్పారు.

# అత్యున్నత విద్యాబోధనే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి శ్రీనివాస్

నెల్లిమర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులందరికీ అత్యున్నత విద్యా బోధనను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వేణుగోపాలపురం ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రూ.745.68 లక్షలతో నిర్మించనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవన సముదాయానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీనిలో అత్యున్నత విద్యాశిక్షణను అందించేందుకు భారీ ఆడిటోరియం, సెమినార్ హాల్, లైబ్రరీ, అదనపు తరగతి గదులు, హాస్టల్ భవనాలను నిర్మించనున్నారు. అదే విధంగా రూ.65.25లక్షలతో నిర్మించిన నాలుగు తరగతి గదులను, రూ.61.10లక్షలతో నిర్మించిన ప్రహరీని మంత్రి



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనాలకు భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్సీ గాదె, ఎమ్మెల్యే అదితి

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులకు అత్యున్నత శిక్షణ ఇవ్వడానికి, ఆధునిక బోధనా పద్ధతులను నేర్పించడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఏడాది కాలంలోనే ఈ భవనాలను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఏఎంసీ చైర్మన్ కర్రోతు వెంకటనరసింగరావు, టీడీపీ నాయకుడు ఐవీపీ రాజు, డీఈవో యు.మాణిక్యంనాయుడు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణరావు, పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా

● ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలస్‌లోనే కల్తీ మద్యం ఫార్మలా నడుస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. శుక్రవారం రాజాంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కుట్ర పూరితంగా కల్తీ మద్యం ఫార్మలాను తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేశారన్నారు. గత ఐదేళ్ల సరఫరా చేసిన జే బ్రాండ్లలో విషపూరిత పదార్థాలు ఉన్నట్టు చెన్నై, బెంగుళూరు, అమెరికా ల్యాబ్‌లు స్పష్టం చేశాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో జంగారెడ్డిగూ డెంలోనే కల్తీ సారా తాగి 27 మంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

ప్రాణాలు పోతే కనీసం పోస్టుమార్టమైనా చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురవాన నారా యణరావు, వంగా వెంకటరావు వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యానికి అవకాశం లేదు

నెల్లిమర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలో కల్తీ మద్యం అమ్మకాలకు అవకాశం లేదని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్‌తో కలిసి ఆయన శుక్రవారం నెల్లిమర్లలోని మద్యం దుకాణాలను పరిశీలించారు. ఏపీ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పల నాయుడు, పార్టీ నాయకులు అవనాపు సత్యనారాయణ, రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం నాణ్యతను తెలుసుకోండి

విజయనగరం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సురక్షా యాప్‌తో వినియోగదారులు మద్యం నాణ్యతను తెలుసుకోవచ్చని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి అన్నారు. జిల్లా కేంద్రంలోని మద్యం దుకాణాలు, బార్ల వద్ద శుక్రవారం ఆయన సురక్షా యాప్ పోస్టర్‌ను అంటించారు. అలాగే వినియోగదారులకు ఏపీ సురక్షా యాప్‌ని ఏ విధంగా డౌన్‌లోడ్ చేసుకోవాలి.. దీని ద్వారా మద్యం నాణ్యతను ఏ విధంగా తెలుసుకోవాలి అనేదానిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్ల వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం నాణ్యతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా ఎక్సైజ్ సూపరిడెంటెం ట్ బి.శ్రీనాథుడు మాట్లాడుతూ ఎక్కడైనా మద్యంలో నాణ్యత లోపిస్తే, తక్షణమే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం టౌన్ సీఐ మన్మథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎట్టకేలకు అందిన పరిహారం



బంగార్రాజును సన్మానిస్తున్న దృశ్యం

భోగాపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన రైతులకు ఎట్టకేలకు వారి ఖాతాల్లో పరిహారం జమఅయ్యింది. దీంతో దీనికి కృషిచేసిన మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజును వారు శుక్రవారం పోలిపల్లిలో సన్మానించారు. గురువారం బంగార్రాజు కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని కలిసి, పరిహారం విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్.. 15మంది రైతుల ఖాతాల్లోకి శుక్రవారం రూ.7కోట్ల 9లక్షల 54వేలు జమచేయించారు. దీంతో రైతులు బంగార్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కలెక్టర్‌కు, ఆర్డీవో కీర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

భోగాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన వినతులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించి.. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## రైతులకు అండగా నిలవాలి

రాజాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా చితికిపోకుండా సహకార సంఘాలు ఎంతో తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రాజాం సహకార సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన.. సంఘం అధ్యక్షుడు వంగా వెంకటరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులు నాగళ్ల అప్పలనాయుడు, సామంతుల గౌరినాయుడు తదితరులతో ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పల పూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రూ.34లక్షల 9వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

## సైనిక్ స్కూల్ ప్రవేశాల వయోపరిమితి సవరించాలి

విజయనగరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు నిర్దేశించిన వయో పరిమితి మార్చి 31 నుంచి జూలై నెలకు సవరించాలని యువ సమ్మేళనం ప్రతినిధి పొట్నూళ్ల ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్అండ్‌బీ సమీపంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం నవోదయ, ఆరో తరగతి ప్రవేశానికి అర్హత పొందిన విద్యార్థికి సైనిక్ స్కూల్ ప్రవేశానికి అర్హత లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రవేశాలకు వయోపరిమితిని మార్చి 31కి లెక్కించడం వల్ల నష్టం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో మొక్కలు నాటారు

పూసపాటిరేగ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అగ్రహారం గ్రామంలో మూడో దశ మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్, జనసేన పార్టీ మండల నాయకుడు కోట్ల రఘు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు చోట్ల మొక్కలు నాటారు. స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రాజ్‌కుమార్, పాపినాయుడు పాల్గొన్నారు. సర్పంచ్ తన సొంత నిధులు రూ.6లక్షలు కేటాయించి ఈ మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారు.

## యువతలో దేశభక్తిని పెంపొందించాలి

● కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యువతలో దేశభక్తిని పెంపొందించాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమంలో భాగంగా యూనిటీ మార్చ్ ఆఫ్ మోడర్న్ ఇండియా పోస్టర్లను శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత, ఐక్యమత్య భావనలను ప్రజల్లో పెంపొందించాలన్నారు. జిల్లాలో కనీసం వెయ్యిమంది యువకులతో పాదయాత్రను నిర్వహించాలని సూచించారు. డిల్లీలో జరిగే జాతీయ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

స్థాయి పాదయాత్రకు జిల్లా నుంచి ఇద్దరు ప్రతిభావంతులైన యువకులను ఎంపిక చేసి పంపించాలన్నారు. ఈ సమావేశంలో యువజన సమన్వయకర్త ప్రేమ భరత్ కుమార్, సెట్విజ్ మేనేజరు ఏవీ రమణ, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు ఉన్నారు.

## జగన్ మాటలకు జనం నవ్వుకుంటున్నారు

● డీసీసీబీ చైర్మన్ నాగార్జున

చీపురుపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటరును విశాఖకు రప్పించే విషయంలో వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ప్రకటనల పట్ల ప్రజలు నవ్వుకుంటున్నారని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం హయాంలోనే డేటా సెంటరు విశాఖకు వచ్చిందని, ఇప్పుడు ఆ క్రెడిట్‌ను చంద్రబాబునాయుడు కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారని జగన్ చెప్పడం చూస్తుంటే, ఆయన బుకాయింపు ఏ స్థాయికి చేరిందో అర్థమవుతుం దన్నారు. ఆయన ప్రకటనలు విని రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. అదే విధంగా నకిలీ మద్యంపైన, ఉద్యోగుల సంక్షేమం పైన జగన్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. పారిశ్రామికవేత్తలను తరిమి కొట్టిన చరిత్ర కలిగిన ఆయన గూగుల్ డేటా సెంటరు ను తానే తెచ్చినట్టు చెప్పుకోవడం సిగ్గుమాలినతనానికి నిదర్శనమని నాగార్జున అన్నారు.

## ఐఐఎఫ్ఎస్ఈ సంస్థకు జాతీయ స్థాయి గుర్తింపు

విజయనగరం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫైర్ హెల్త్ సేఫ్టీ ఎన్విరాన్‌మెంట్ విభాగంలో ఉత్తమ సేవ లు అందించేందుకు జిల్లాలోని పూసపాటిరేగ మండలా నికి చెందిన ఐఐఎఫ్ఎస్ఈ సంస్థకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ సేఫ్టీ ఆర్గనైజేషన్, నేషనల్ అవార్డు 2025ను ఐఐఎఫ్ఎస్ఈ అవార్డు గెలుచుకుంది. ఈ అవార్డును ముంబాయిలోని ది లలిత్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీను మహంతికి ప్రదానం చేశారు. ఈ అవార్డును డైరక్టరేట్ ఆఫ్





అవార్డు అందుకుంటున్న శ్రీను

ఇండస్ట్రియల్ సేఫ్టీ హెల్త్ మహారాష్ట్ర అదనపు డైరెక్టర్ శ్రీరామ్ భగీరథి భాయి దిగంబరావు దహీపలే, గోద్రేజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఈడీ, సీఈవో విశాల్‌శర్మ, తమిళనాడుకు చెందిన జహో రాంకీ వొల్ఫ్ మిషిన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ వువే జార్జ్ ఫిషర్, భారత ప్రభుత్వ రిటైర్డు కార్మిక ఉపాధి డైరెక్టర్ జనరల్ జీఎంఈకే రాజ్‌లు.. శ్రీను మహంతికి అందజేశారు. ఈ విజయం తమ సంస్థ శ్రేష్ఠత, భద్రత పట్ల నిబద్ధతకు నిదర్శనమన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్‌డే

డెంకాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నాడ వద్దగల లెండి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సిస్టం, ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విభాగాలకు చెందిన సీనియర్ విద్యార్థులు విడివిడిగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో పరిశ్రమ, విద్యారంగాల ప్రముఖులు పాల్గొని తమ విలువైన ఆలోచనలు, అనుభవాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో



వేడుకల్లో అతిథులను సత్కరిస్తున్న దృశ్యం

వైస్ ప్రిన్సిపాల్ డా.హరిబాబు తమ్మినేని, కేవీ నరసింహం, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాశ్‌బాబు, విభాగాధిపతులు డా.రామారావు, డా.సుబ్బారామయ్య, డా.రాజేంద్ర, డా.ఎం.రాజన్‌బాబు, డా.వి.ప్రసాద్, జి.సతీష్, డా.సతీష్ పూజారి, డా.పీడీశైలజ పాల్గొన్నారు.

## ఫోర్టుసిటీ స్కూల్‌కు ఎడ్యూ ఐకాన్ అవార్డు

విజయనగరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో విశేష కృషి చేసినందుకు ఫోర్టుసిటీ స్కూల్‌కు మల్లా బ్యూరో ఆఫ్ చిల్డ్రన్ డెవలప్‌మెంట్ అందించే 'ఎడ్యూ ఐకాన్ అవార్డు-2025' అవార్డు లభించింది. శుక్రవారం విశాఖపట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో విశాఖ ఎంపీ ఎం.భరత్ చేతులమీదుగా పాఠశాల డైరెక్టర్ మధు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కేఏపీ రాజు మాట్లాడుతూ నేడు మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. ఈ అవా



ఎంపీ భరత్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ మధు

ర్డుకు కృషి చేసిన వైఎస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రోహిణిఖాన్, డైరెక్టర్లు అశోక్, మధు, నీలిమాలకు అభినందనలు తెలిపారు.

## ప్రజాభిప్రాయ సేకరణ బూటకమేనా?

● కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల రిలే దీక్షలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ పరిశ్రమ భూసేకరణకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ బూటకమేనా అంటూ జిందాల్ నిర్వాసితులు మండిపడుతున్నారు. శుక్రవారం బొడ్డవరలో 126వ రోజు నిరసన, రిలే దీక్షలో వారు పాల్గొని, మాట్లాడారు. అప్పట్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించినప్పుడు తమ భూములు జిందాల్ కర్మాగారానికి అన్నారని.. తీరా ఇప్పుడు వేరే పరిశ్రమలకు కేటాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా తమ భూములు తమకు అప్పగించి మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా తమ భూములను పరిశ్రమలకు సేకరించాలని వారు కోరారు. వీరికి సంఘీభావంగా జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ రిలే దీక్షలో పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

## గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

కొమరాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విక్రంపురం సమీపంలోని మామిడి తోటలో పార్వతీపురం మండలం కోటవానివలస గ్రామానికి చెందిన కొచ్చెర్ల సుధీర్‌కుమార్(30) గడ్డి మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మందు తాగిన వెంటనే భార్యకు ఫోన్ చేసి విషయం తెలియజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని, అతన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుధీర్‌కుమార్ మృతిచెందాడు. కుటుంబ తగాదాల నేపథ్యంలో సుధీర్ మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నానిగిరి వీధిలో తన ఇంటి దగ్గర ఉన్న చెట్టుకొమ్మలు కొడుతూ జారిపడిన వ్యక్తి విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నానిగిరి వీధికి చెందిన నానిగిరి చంద్రరావు (50) ఈనెల 19న తన ఇంటికి సమీపంలో ఉన్న చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు పైనుంచి జారి పడ్డాడు. వెంటనే కుటుంబీకులు ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పి చికిత్స చేయిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య శంకరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## గర్భిణి ఆరోగ్యంపై దృష్టి

భోగాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ సముద్ర సరిహద్దు జలాలు దాటడంతో కొండ్రాజుపాలెంకు చెందిన మత్స్యకారులు అక్కడ కోస్టు గార్డుకు చిక్కారు. వీరిలో సూరాడ అప్పలకొండ ఉన్నారు. అతని భార్య సూరాడ అనిత ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. ఆమె పరిస్థితిపై ఈనెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'నా భర్తను చూడాలని ఉంది' అనే వార్త ప్రచురితమయ్యింది. దీనికి స్పందించిన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి.. ఆమె ఆరోగ్యంపై దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో జీవనరాణికి సూచించారు. దీంతో డీఎంహెచ్‌వో.. విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధికారి వేమూరి సుబ్రహ్మణ్యంను విశాఖ జిల్లా రెల్లివీధిలో నివాసం ఉన్న అనిత ఇంటికి పంపించారు. ఆయన అక్కడికి వెళ్లిన అనిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా అనిత మాట్లాడుతూ విశాఖ ఘోషాసుపత్రి ద్వారా వైద్య సేవలు అందించే విధంగా చూడాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ డీఎంహెచ్‌వోతో మాట్లాడి తదుపరి చర్యలు చేపడతామని, ధైర్యంగా ఉండాలని ఆయన ఆమెకు భరోసా ఇచ్చారు.



అనితను పరామర్శిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి సుబ్రహ్మణ్యం

## కేంద్ర మంత్రి బాధ్యత తీసుకోవాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన దక్షిణ కోస్తా రైల్వే కార్యక్రమాలు కేంద్రం గజిట్ విడుదల చేయకపోవడంతో ముందుకు కదల్లేదు.. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు బాధ్యత తీసుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కేంద్రమంత్రికి రాసిన లేఖను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఫిబ్రవరిలో జోన్ ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని 2020లో రూ.170 కోట్లు బడ్జెట్ కేటాయించారని చెప్పారు. 2025 జనవరిలో డీపీఆర్ ఆమోదం పొంది, జనవరి 8న ప్రధాని నరేంద్రమోదీ జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారన్నారు. పది నెలలు గడిచినా, ఎటువంటి కార్యక్రమాలు ముందుకు సాగలేదన్నారు. తక్షణమే ఉత్తరాంధ్రకు చెందిన ఎంపీలు, మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నాగభూషణం, రాజారావు, రమేష్, రామచంద్రరాజు, నాగరాజు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారం చేస్తున్నారు

చీపురుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విధానంలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం పట్ల అవగాహన లేని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. పీపీపీ విధానంపై పార్టీ ముద్రించిన పోస్టర్‌ను ఆయన చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి సంత కాల పేరుతో వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గత ఐదు సంవత్సరాల్లో వైద్య కళాశాలల ఊసెత్తని జగన్ ఇప్పుడు విషం చిమ్ముతు న్నారని ఆయన విమర్శించారు. పీపీపీ విధానం వల్ల ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెరుగుతాయని, రాష్ట్రంలోని విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

## బొద్దాం రైతులపై కేసు కొట్టివేత

వేపాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటూ 2018 జనవరిలో రైతులు చేసిన ఆందోళనపై పోలీసులు పెట్టిన కేసును కొత్తవలస కోర్టు కొట్టేసింది. దీనిపై ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్ శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రైతు నాయకులపై పెట్టిన కేసు రద్దు కావడం రైతుల సంఘాల విజయమన్నారు. సరైన సాక్ష్యాధారాలు లేనందున కొత్తవలస కోర్టు కేసును కొట్టువేసిందని తెలిపారు.

## ఉద్యానవన శాఖ రాయితీలను వినియోగించుకోండి

బొండపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ రాష్ట్ర ఉప సంచాలకుడు ఏవీఎస్‌వీ జమదగ్ని అన్నారు. మండలంలోని జె.గుమడాం, వెదురువాడ గ్రామాల్లో సాగుచేస్తున్న ఆయిల్‌పాంతోపాటు గ్రాఫ్టెడ్ టమాటా సాగుపంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. డ్రిప్, బిందు సేద్యం పరికరాలను శతశాతం రాయితీతో చిన్న, సన్నకారు రైతులకు అందిస్తామని చెప్పారు. అనంతరం ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి కె.చిట్టిబాబు, మైక్రో ఇరిగేషన్ పీవీపీఎస్‌వీ లక్ష్మీనారాయణ, మండల ఉద్యానవన శాఖాధికారి దీప్తి, సచివాలయ ఉద్యాన సహాయకులు టి.నారాయణరావు, వెంకట్‌లు పాల్గొన్నారు.

## బైండోవర్ కేసుల నమోదు

గజపతినగరం అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి గ్రామాల్లో అక్రమంగా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ శాఖ సీఐ జనార్దనరావు శుక్రవారం తెలిపారు. పలు గ్రామాకు చెందిన బెల్టు షాపు నిర్వాహకులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.రత్నకుమార్ ఎదుట హాజరు పరిచారు. ఒకొక్కరి నుంచి సుమారు రూ.2లక్షల బాండ్లు సమర్పించి బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

● పూసపాటిరేగ: మండలంలో గతంలో బెల్ట్ దుకాణాలు నిర్వహించిన 18 మందిపై ఎక్సైజ్ శాఖ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బైండోవర్ కేసులను నమోదు చేసింది. మళ్లీ బెల్ట్ షాపులు నిర్వహించి కేసులు నమోదైతే రూ.లక్ష అపరాధ రుసుం గానీ, జైలు శిక్షకు విధిస్తారు. ఈ అంగీకారంపై వారికి బెండోవర్ చేశారు.

● సంతకవిటి: రాజాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికార మద్యం అమ్మకాలు నిర్వహిస్తూ పట్టుబడిన పది మందిని సంతకవిటి తహసీల్దార్ ముందు శుక్రవారం హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ.లక్ష అపరాధ రుసుం, పూచికత్తులపై ఒక సంవత్సర కాల వ్యవధికి బైండోవర్ చేసినట్టు అధికారులు తెలిపారు. రాజాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

నెల్లిమర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్‌లో శుక్రవారం ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడా రు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ మా ట్లాడడం గానీ, వారు అడిగిన సమాచారం ఇవ్వడం గానీ చేయరాదన్నారు. విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్‌కుమార్. పీఎస్ఐ, డైట్ ప్రిన్సి పాల్ డా.కె.రామకృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం

(ఐదో పేజీ తరువాయి)

లోడింగ్‌కు సంబంధించి క్వింటాకు రూ.22 చొప్పున వారికి చెల్లించనున్నారు. రైతులు లోడింగ్ చేయకపోతే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులే ఆ ప్రక్రియ చేపడతారు.

**పర్యవేక్షణ అవసరం...**

జిల్లాకు సరిహద్దుల్లో ఉన్న ఒడిశా గ్రామాల నుంచి ధాన్యం సేకరించి కొన్నాళ్లుగా ఇక్కడ విక్రయించే పరిస్థితి ఉంది. కొంతమంది దళారులు ఇష్టారాజ్యంగా ఈ దందా సాగిస్తున్నారు. వారి వల్ల జిల్లా రైతులు నష్టపోతుండగా.. వారి ధాన్యం విక్రయాలు ఆలస్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాల్సి ఉంది. అర్హులైన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా పనిచేయాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సచివాలయ, వ్యవసాయశాక సిబ్బందికి పూర్తిస్థాయి ఆదేశాలు జారీ చేసి.. ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

**ధాన్యం కొనుగోలుకు చర్యలు..**

'జిల్లాలో నవంబరు పదో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నెల 27 నుంచి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తాం.' అని సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.

## టెట్ నోటిఫికేషన్ జారీ

( 5వ పేజీ తరువాయి)

అర్హత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఐదేళ్లలోపు (2030 ఆగస్టు నాటికి) పదవీ విరమణ చేయనున్నవారికి మినహాయింపు ఇచ్చింది. వారికి పదోన్నతి కావాలంటే టెట్ పరీక్షను రాయాల్సిందేనని స్పష్టం చేసింది. ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు సైతం టెట్ నిర్వహించనుండడంతో వారిలో భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేరళ, చెన్నైలో మాదిరిగా ఏపీ ప్రభుత్వం సైతం సుప్రీంలో రివ్యూ పిటిషను వేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# టీడీపీలో వంద కుటుంబాల చేరిక

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కొదమ పంచాయతీ పరిధిలోని వంద కుటుంబాలు శుక్రవారం సాలూరులో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమక్షంలో టీడీపీలో చేరాయి. వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆమె సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు న్యాయమైన పాలన అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, యువత భవిష్యత్తు బాగుండేలా నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ కండువా వేస్తున్న మంత్రి సంధ్యారాణి

## విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించండి



ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని కోరుతూ హెల్త్ వలంటీర్లతో కలిసి ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను వెనువెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల మాదిరిగా ఆశ్రమ పాఠశాలల్లోనూ డైట్ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతు ఇన్‌చార్జి ఏపీవో గణేష్‌కు వినతిపత్రం అందజేశారు.

## ప్లాస్టిక్ సామగ్రిని వినియోగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని దుకాణదారులు ప్లాస్టిక్ సామగ్రిని వినియోగిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ అమ్మకంపై నిషేధించామన్నారు. దుకాణదారులు నిబంధనలు ధిక్కరిస్తే అపరాధ రుసుం విధిస్తామన్నారు. పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సహకరించండి

పార్వతీపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు మిల్లర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని తహసీల్దార్ సురేష్ సూచించారు.. శు క్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో రైస్ మిల్లర్లు, ధాన్యం కొనుగోలు సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలును సక్రమంగా చేపట్టాలన్నారు. రైతులకు 24 గంటల్లో ధాన్యం కొనుగోలు సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

మక్కువ రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నోడల్ అధికారి కె.సి.రెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఫ్రైడే, డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో అర్జునరావు మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగునీటి నిల్వలు, చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఏపీఎం జయకుమార్, పంచాయతీ కార్యదర్శి విలాస్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● సీతంపేట రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యవంత జీవనం సాధ్యమని మండల ప్రత్యేక అధికారి, ఇన్‌చార్జి ఏపీవో ఆర్‌వీ గణేష్ అన్నారు. సీతంపేటలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మిశ్రో, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో ఆనందరావు, హెచ్ఎం చంద్రరావు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామసభ ఆమోదంతోనే అభివృద్ధి పనులు

గరుగుబిల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు గ్రామసభ ఆమోదం తప్పనిసరి ఏపీవో ఎం.ఈశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం గిజబ, కొంకడివరం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 25 పంచాయతీల్లో గుర్తించిన పలు రకాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సమావేశంలో ఉపాధి ఇంజనీర్ డి.తేజేశ్వరరావు, సర్పంచ్‌లు ఎ.అప్పలనాయుడు, ఎం.భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు సామాజిక బాధ్యత అవసరం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పాలకొండ, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు సామాజిక బాధ్యతపై విద్యార్థులకు దృష్టి పెట్టాలని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను సందడిగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎస్ఐ ప్రయోగమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీడీసీ సెక్రటరీ చౌదరినాయుడు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సుంకరి సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లైస్ గోదాం తనిఖీ



గోదాంను తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ

మక్కువ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సివిల్ సప్లైస్ గోదాంను శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ సుధారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపులకు సరుకుల పంపిణీ తీరు పరిశీలించారు. సరుకులు సక్రమంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు కె.భరత్‌కుమార్‌ను ఆదేశించారు. అంతకు ముందు ఆమె మండల రెవెన్యూ కార్యాలయంలో పీజీఆర్ఎస్ అమలుపై సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై అధికారులకు సూచనలిచ్చారు. ప్ర.ఆ సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

## గంజాయి నిర్మూలనలో భాగస్వాములుకండి



మాట్లాడుతున్న సీఐ మురళీధర్

పార్వతీపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని సీఐ మురళీధర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ కార్మికులతో గంజాయి రవాణా, నిర్మూలనపె నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశభవిష్యత్‌కు పునాదులైన యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి రవాణాను అరికట్టాలంటే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లే కీలకమన్నారు. ఒడిశా నుంచి పార్వతీపురానికి ఆర్టీసీ బస్సుల్లో గంజాయి రవాణా కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మార్గమధ్యలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు మూటలు, సంచులతో బస్సులు ఎక్కితే వారు తెస్తున్న వస్తువుల వివరాలను తెలుసుకోవాలన్నారు.కార్యక్రమంలో డీపీటీవో వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్ లక్ష్మణరావు, ఎస్ఐ పాపయ్య, ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

సాలూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగానికి పారిశుధ్య కార్మికులు దూరంగా ఉండాలని పట్టణ సీఐ పి.రామకృష్ణ కోరారు. మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పారిశుధ్య కార్మికులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలని హితవు పలికారు. వీటి వాడకం వలన ఆరోగ్యంతోపాటు సమాజంలో కూడా చులకన భావం పెరిగి కుటుంబ, మానవ సంబంధాలు దెబ్బతింటాయని వివరించారు. కార్యక్రమంలో పలువురు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజేతలకు అభినందనలు

వీరఘట్టం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వీరఘట్టంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. 17 పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో ఎల్.ఎస్.నీరజ, గాయత్రీ, కుమారస్వామి... క్విజ్ పోటీల్లో నీరజ, కుమారస్వామి, జి.శరణ్య వరుసగా ప్రథమ, ద్వియ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మండల స్థాయిలో విజేతలు పాలకొండలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. విజేతలను ఎంఈవోలు జి.గౌరునాయుడు, ఆనంద్, రాములు అభినందించారు.

● పాలకొండ: పట్టణంలోని హడ్కోకాలనీలో జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగ చరిత్ర అంశంపై నిర్వ హించిన పోటీలో పాలకొండకు చెందిన కుప్పిలి గీతిక ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు అభి నందించారు.

## భూ ఆక్రమణలపై ఆరా

పాలకొండ, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): బెజ్జి గ్రామంలో భూ ఆక్రమణలపై శుక్రవారం తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి ఆరా తీశారు. స్థానిక భూ ఆక్రమణలపై కూటమి నాయకులు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన స్పందించి బెజ్జి గ్రామాన్ని సందర్శించారు. సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పరిశీలనలో నీటి సంఘం వైస్ ఛైర్మన్ వావిలపల్లి సత్యంనాయుడు, జనసేన నాయకులు ప్రసాదరావు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం వద్దకు చేరిన పంచాయితీ

● భూములు ఆన్‌లైన్ కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు

పార్వతీపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం వండువ గ్రామానికి చెందిన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు కాని విషయం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి వెళ్లింది. స్థానిక రైతుల సమస్యను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆయనకు వివరించారు. సుమారు 600 మంది రైతులకు పథకం అమలు కాలేదని చెప్పారు. వాస్తవంగా 600 మంది రైతులు సుమారు 353 ఎకరాలను కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారన్నారు. అయితే అవి ఈనాం భూములు కావడంతో ఆన్‌లైన్‌లో నమోదుకు సాంకేతిక సమస్యలు రైతులకు శాపంగా మారాయి. ఇక్కడి రైతుల సమస్యలపై డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. దీంతో రైతులకు అన్నదాత సుఖీభవ మంజూరు కాపోవడానికి కారణాలపై డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు ఆరా తీశారు. అదే విషయంపై కలెక్టర్ కార్యాలయ అధికారులతో డిప్యూటీ సీఎం మాట్లాడినట్టు తెలుస్తోంది. రైతుల సమస్య పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం.

● దీనిపై జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వండువ రైతుల భూ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. త్వరలోనే సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు.

**పాచిపెంట మండలంలోనూ సమస్య..**

ఈనాం భూముల సమస్య జిల్లాలోని పాచిపెంటలోనూ ఉంది. ఈ మం డలంలో 13 గ్రామాల పరిధిలో 12606 ఎకరాలు ఇనాం భూములుగా నమోదయ్యాయి. దీంతో వాటి సర్వే కూడా జరగని పరిస్థితి ఉంది. 1948 నుంచి ఈ సమస్య కొనసాగుతోంది. తాజాగా ప్రభుత్వం కూడా ఈనాం భూములు సమస్యలపై కమిటీ వేసినట్టు సమాచారం. ఈ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటే ఈ భూములు సాగు చేసే రైతు లకు ఊరట కలగనుంది.

## రైతులే శాస్త్రవేత్తలుగా మారాలి



మాట్లాతున్న శ్రావణ్‌కుమార్

గరుగుబిల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు శాస్త్రవేత్తలుగా తయారు కావాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్‌కుమార్ నాయుడు అన్నారు. శుక్రవారం తోటపల్లి జట్టు కార్యాలయం ప్రాంగణంలో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శిక్షకుడు 10 మంది రైతులతో పంటలు నమూనాలను వేయించాలన్నారు. రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ మాట్లాడుతూ రైతులు చిరు పంటలు సాగుపై దృష్టి సారించాలన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ ప్రకృతి విధానాలపై రైతుల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు జి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

## వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టండి

భామిని, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కల్తీ మద్యం కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లి తిప్పికొట్టాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె బత్తిలిలో కార్యకర్తలతో మాట్లాడారు. లిక్కర్ మాఫియా రూ.3500 కోట్లు జగన్ దోచుకున్నార న్నారు. కల్తీకి ఆస్కారం లేకుండా అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాత కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాలు చేపడుతోందన్నారు.

## ఇంటింటా కుళాయిలు ప్రారంభం

పాలకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్థలి గ్రామంలో శుక్రవారం ఎంపీపీ భాను సుధాకర్ ఇంటింటా కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివ, మాజీ సర్పంచ్ శ్రీహరిరావు, కూటమి నాయకులు వెంకటరమణ, ఆదినారాయణ, మజ్జి శ్రీనివాస్, సురేష్, హరిబాబు, గోపి, బొత్స కృష్ణ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణపై సమావేశం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల నుంచి ధాన్యం సేకరణ కొనుగోలుపై శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శేఖర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 27 పంచాయతీల్లో ధాన్యం సేకరణపై రైతులకు అవ గాహన కల్పించారు. సమావేశంలో ఏవో శంకరరావు పాల్గొన్నారు.

## పెదబుడ్డిడిలో వ్యాన్ బోల్తా

జియ్యమ్మవలస, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెదబుడ్డిడి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం కూల్ డ్రింక్స్‌తో వ్యాన్ బోల్తా పడింది. సీసీ రోడ్డు నుంచి వ్యాన్ పక్కకు ఒరిగిపడిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సాయంతో కూల్ డ్రింక్స్‌ను వేరే వ్యాన్‌లోకి ఎక్కించారు.

## ఆదర్శ పాఠశాలలో మాక్ పార్లమెంట్

భామిని, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భామినిలోని ఆదర్శ పాఠశాలలో మాక్ పార్లమెంట్‌ను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు అధికార, ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సంతోష్, శ్రావణి, వినోద్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బాబూరావు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినతులను స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రజా దర్బార్ లక్ష్యమని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సంబంధిత సమస్యలపై ఆమె అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎండీని కలిసిన ఎమ్మెల్యే



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును అమరావతిలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం కలిశారు. ఇటీవల పార్వతీపురం బస్టాండ్‌లో బాణసంచా పేలుడు ఘటనలో గాయపడిన బాధితులను ఆదుకోవాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పం దించిన ఆయన.. బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్న తర్వాత బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

**విద్యుత్ శాఖ మంత్రిని...**

పార్వతీపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర శుక్రవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా బలిజిపేట మండలంలో అడ్డాడ, పార్వతీపురం ఎం.ఆర్.నగరం ప్రాంతాలకు సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించడంపై ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డులోని భవన నిర్మాణాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు.

## పురమిత్ర యాప్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు కోరారు. గురువారం పట్టణంలోని సచివాలయ ఉద్యోగులు పురమిత్ర యాప్ సేవలపై స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో పురమిత్ర యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని పురపాలక సంఘ కార్యాలయంలోని 8 విభాగాలకు సంబంధించి 119 పౌర సేవలను వినియోగించుకోవచ్చన్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, మురుగు నీరు, పట్టణ ప్రణాళిక విభాగం, వీధి లైట్ల నిర్వహణ, పన్నుల చెల్లింపుల సమస్యల పరిష్కారానికి పురమిత్ర యాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్‌లు, మేధావులు, విద్యావంతులు పురమిత్ర యాప్‌పై విస్తృత ప్రచారం చేసే బాధ్యతను తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తవలస, గోపాలదాసుపేట 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ దివ్య ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం వరకూ కొత్తవలస, గోపాలదాసుపేట 11 కేవీ ఫీడర్ పరిధిలోని బైపాస్ రోడ్డు, బందంవారి వీధి, ఫైఓవర్ డౌన్, ఎస్ఎన్ఎం నగర్, మున్సిపల్ కార్యాలయం రోడ్డు, రెల్లి వీధి, రాయగడ రోడ్డు, కొత్తవలస ఫ్లైఓవర్ ప్రాంతం నుంచి నవిరి కాలనీ వరకు విద్యుత్ సరఫరాలో అంత రాయం కలుగుతుందని పేర్కొన్నారు.

## వచ్చేనెల 6న నందన్న అనుపోత్సవం

సాలూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాగులచవితి రోజున నిర్వహించనున్న నందన్న అనుపోత్సవాన్ని వచ్చే నెల 6కు వాయిదా వేశామని నందెన్న ఉత్సవ కమిటీ సభ్యులు మజ్జి చిరంజీవిరావు, నటరాజ్, వార్డు కౌన్సిలర్ శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా అనుపోత్సవాన్ని వాయిదా వేశామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని వారు కోరారు.

## ఏఎన్ఎంలను నియమించాలి

కొమరాడ, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను తక్షణమే నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బిడ్డిక అనీల్ కోరారు. శుక్రవాఠం ఆయన స్థానిక కేజీబీవీ, ఉలిపిరి ఆశ్రమ పాఠశాలతో పాటు పలు విదాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని, రామభద్రపురం నుంచి ఉలిపిరి ఆశ్రమ పాఠశాలకు తారు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.అఖిల్ పాల్గొన్నారు.



## సకాలంలో సరుకులు ఇవ్వాలి

సీతానగరం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు నిర్దేశించిన గడువులోగా సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ డీలర్లను ఆదేశించారు. ఆధార్ సీడింగ్ లేనివారికి చేయించాలని సూచించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డీల ర్లు లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలన్నారు. ధరల పట్టిక బోర్డులు వేలాడదీయాలన్నారు. తూకంలో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.







